సాక్షి కామారెడ్డి

గురువారం । 30 । నవంబర్ । 2023



పదికి పక్కా ప్రణాళిక

పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

- 8లో ▸



భారీ వర్షం

తాడ్వాయి మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పంటలకు నష్టం వాటిల్లింది.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.7 /19.7

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

కంట్రోల్ రూం సందర్శన



కంట్రోల్ రూంలో సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంను కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాలలో వచ్చే వార్తలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఓటింగ్ సరళికి సంబంధించి వదంతులు, అసత్య వార్తలు ప్రసారమైతే వెంటనే స్పందించి వాటిని నిలిపి వేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్‌కు సంబంధించి ఓటింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలిస్తూ ఎటువంటి చిన్న సంఘటన దృష్టికి వచ్చినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి టేబుల్ వద్ద ఓట్ల లెక్కింపును సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్‌లలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ పాటిల్ మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ కంట్రోల్ రూంను సందర్శించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా చెక్‌పోస్ట్‌లలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు మనుచౌదరి, చంద్రమోహన్, మన్నె ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, నోడల్ అధికారులు సింహారావు, దయానంద్, సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఆ అభ్యర్థులు.. ఓటేసుకోలేరు!

సాక్షి, కామారెడ్డి: ఎన్నికల బరిలో నిలిచి హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. ఓటేసి తమనే గెలిపించాలని ఓటరు దేవుళ్లను కోరారు. అయితే ఇతరుల ఓట్లభ్యర్థించిన ఆ అభ్యర్థులు.. తమ ఓటు తమకు వేసుకోలేకపోతున్నారు. పలువురు అభ్యర్థుల ఓట్లు వారు పోటీ చేస్తున్న నియోజకవర్గం పరిధిలో లేకపోవడమే ఇందుకు కారణం..

కామారెడ్డి నియోజకవర్గంనుంచి పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కేసీఆర్ ఓటు సిద్దిపేట జిల్లా చింతమడకలో ఉంది. ఆయన తన ఓటును అక్కడే వినియోగించుకోనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రేవంత్‌రెడ్డి ఓటు కొడంగల్ నియోజకవర్గంలో ఉంది. ఆయన కూడా తన ఓటు అక్కడే వేయనున్నారు. బాన్సువాడ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఏనుగు రవీందర్‌రెడ్డి ఓటు ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో ఉంది. ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న యెండల లక్ష్మీనారాయణ ఓటు నిజామాబాద్ నగరంలో ఉంది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన మదన్‌మోహన్‌రావు ఓటు హైదరాబాద్ నగరంలోని ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉంది. చిన్నాచితకా పార్టీల అభ్యర్థులు, కొందరు ఇండిపెండెంట్లు కూడా తమ ఓటు తమకు వేసుకోలేకపోతున్నారు.

ఓటుకు వేళాయె

- నేటి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు పోలింగ్
- పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది



సాక్షి, కామారెడ్డి: ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ ప్రక్రియ మరికాసేపట్లో మొదలుకానుంది. గురువారం ఉదయం 7 గంటలకు మొదలై సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ జరుగనుంది. పోలింగ్ సిబ్బంది బుధవారమే కేంద్రాలకు చేరుకుని, అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు.

జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అత్యధికంగా కామారెడ్డి నియోజకవర్గంలో 39 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇక్కడినుంచే పోటీ చేస్తున్నారు. జుక్కల్‌లో 17 మంది, ఎల్లారెడ్డిలో 11 మంది, బాన్సువాడలో ఏడుగురు అభ్యర్థులు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. విజయం కోసం శ్రమిస్తున్న అభ్యర్థులు.. దాదాపు మూడు వారాలపాటు ఊళ్లను చుట్టేశారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలతో ప్రచారాన్ని హోరెత్తించారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు చివరి నిమిషం వరకు ప్రయత్నించారు.

ఏర్పాట్లు పూర్తి..

పోలింగ్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల నిర్వహణకు 3,160 మంది సిబ్బందిని నియమించారు. మరో 20 శాతం మంది అంటే 636 మందిని రిజర్వ్‌లో ఉంచారు. వాళ్లతో కలిపి 3,820 మంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి సిబ్బందిని ప్రత్యేక బస్సులలో పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలకు పంపించారు. కామారెడ్డిలో 39 మంది

- మిగతా 8వ పేజీలో..

క్లుప్తంగా

పోలింగ్‌కు భారీ బందోబస్తు

కామారెడ్డి క్రైం: జిల్లాలో గురువారం నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టింది. మొత్తం 9 కంపెనీల కేంద్ర బలగాలు ఇప్పటికే జిల్లాకు చేరుకుని తాము విధులు నిర్వహించాల్సిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. వారితో పాటు మరో 2 వేల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో బందోబస్తు చర్యలు చేపట్టనున్నారు. ఇందుకోసం మహారాష్ట్ర నుంచి 700 మంది పోలీస్ సిబ్బందిని జిల్లాకు రప్పించారు. హోంగార్డులతో కలిపి మన జిల్లాకు చెందిన 11 వందల మంది సివిల్, ఏఆర్ సిబ్బందితో పాటు మహారాష్ట్ర పోలీసులు బందోబస్తు చర్యల్లో పాల్గొంటున్నారు. ఎస్పీ, ఏఎస్పీ, 7గురు డీఎస్పీలు బందోబస్తును పర్యవేక్షించనున్నారు. జిల్లాలోని 125 చోట్ల ఉన్న 239 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద స్థానిక పోలీసులతోపాటు కేంద్ర బలగాలను సైతం మోహరించారు.

ఎన్నికల విధుల్లో వైద్యశాఖ సిబ్బంది

కామారెడ్డి టౌన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యశాఖ నుంచి ఏఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది విధుల్లో ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. దీంతో ఉద్యోగులు, సిబ్బంది తాము ఓటు ఎలా వేయాలని ఆయోమయానికి గురవుతున్నారు. ఎక్కువగా పట్టణాలు, మండల కేంద్రాల్లో నివసిస్తున్న ఉద్యోగులు ఇతర మండలాల్లో, గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి ఓటు వేసే అవకాశం నివాస పరిసరాల్లో ఉన్నాయి. ఈ క్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికల విధుల్లో ఉంటే ఎలా ఓటు వేస్తామని వారు వాపోతున్నారు. తమకు కూడా బ్యాలెట్ ఓటు అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.కామారెడ్డిలో 266,ఎల్లారెడ్డిలో 270, జుక్కల్‌లో 255, బాన్సువాడలో 122 పోలింగ్ కేంద్రాలకు వైద్య శాఖ ఒక ఏఎన్ఎం, ఆశాలను కేటాయించారు.

షబ్బీర్ అలీ ఇంటి ఎదుట ఉద్రిక్తత



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం, మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఇంటిపై పోలీసులు, ఎస్ఎఫ్‌టీ బృందాల అధికారులు, సిబ్బంది బుధవారం తనిఖీలు చేపట్టారు. స్థానికేతరులు, కర్ణాటక రాష్టానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నారన్న సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో పోలీసులకు, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తమ కు సమాచారం వచ్చినందుకే తనిఖీలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. తనిఖీలో స్థానికేతరులు ఎవరూ లేకపోవడంతో వెనుదిరిగారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో బుధవారం జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయికి జిల్లాస్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. బాలబాలికల విభాగంలో పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. డిసెంబర్ 4, 5వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నారు. క్రీడాకారులను జిల్లా కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, కోచ్ రాగిణిలు అభినందించారు.

ఓటుకు వేళాయె

మొదటిపేజీ తరువాయి

అభ్యర్థులు బరిలో ఉండడంతో ఒక్కో బూత్‌లో మూడు ఈవీఎంలను వాడాల్సి వస్తోంది. జుక్కల్‌లో 17 మంది అభ్యర్థులు ఉండడంతో ప్రతి పోలింగ్ బూత్‌లో రెండు ఈవీఎం యూనిట్లు, ఎల్లారెడ్డి, బాన్సువాడలలో ఒక్కో ఈవీఎం యూనిట్ వినియోగిస్తున్నారు.

125 సమస్యాత్మక కేంద్రాలు...

గతంలో చోటు చేసుకున్న సంఘటనలతో అప్రమత్తమైన అధికారులు జిల్లాలో 125 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఆయా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జుక్కల్ నియోజకవర్గంలో 23, ఎల్లారెడ్డిలో 48, కామారెడ్డిలో 35, బాన్సువాడలో 19 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి వాటి వద్ద కేంద్ర పారామిలటరీ బలగాలను మోహరించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మల ఆధ్వర్యంలో జిల్లాలో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లతో పాటు బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

అందరి దృష్టి కామారెడ్డి మీదే....

బీఆర్ఎస్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్, కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గం మీద అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఇద్దరు వీఐపీలకు గట్టిపోటీ ఇస్తున్నాడన్న ప్రచారంతో అందరూ కామారెడ్డిలో ఏం జరగుతుందన్నదానిపై ఆసక్తిగా గమనిస్తున్నారు. బాన్సువాడలో బీఆర్ఎస్ అభ్యర్థి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు తలపడుతున్నారు. ఏనుగు రవీందర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా, యెండల లక్ష్మీనారాయణ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. జుక్కల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే హన్మంత్ సింధేతో బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే అరుణతార, కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంతరావ్‌లు పోటీ పడుతున్నారు. ఎల్లారెడ్డి నియోజక వర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే జాజాల సురేందర్, కాంగ్రెస్ అభ్యర్థిగా మదన్‌మోహన్‌రావు, బీజేపీ అభ్యర్థిగా సుభాష్‌రెడ్డి బరిలో ఉన్నారు.



కామారెడ్డి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సిబ్బంది

నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	స్త్రీ ఓటర్లు	ఇతరులు	మొత్తం
కామారెడ్డి	266	1,22,019	1,30,417	24	2,52,460
ఎల్లారెడ్డి	270	1,06,347	1,14,181	03	2,20,531
జుక్కల్	255	98,635	1,01,317	10	1,99,962
బాన్సువాడ	258	93,388	1,01,795	08	1,95,191



కామారెడ్డి జెడ్పీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మహిళల ఆదర్శ పోలింగ్ కేంద్రం





డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఓటింగ్ యంత్రాలు, సామగ్రితో బయలు దేరిన పోలింగ్ సిబ్బంది

ఓటరు కార్డు లేకున్నా..

నిజామాబాద్‌అర్బన్: ఓటరు గుర్తింపు కార్డులోని వివరాల్లో స్వల్ప తేడాలున్నా.. ఓటరు గుర్తింపు నిర్ధారణ అయిన పక్షంలో ఓటు హక్కు కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. వేరే నియోజకవర్గానికి సంబంధించిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డును ఆధారంగా చూపి, మరో నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రంలో ఉన్న ఓటును వినియోగించుకోవడానికి వచ్చే వారికి (ఆ పోలింగ్ కేంద్రం ఓటర్ల జాబితాలో పేరున్న వారికి) సైతం ఓటు హక్కు కల్పించాలని సూచించింది. ఓటరు గుర్తింపు కార్డు లేని పక్షంలో, ఒక వేళ ఉ న్నా గుర్తింపు ధ్రువీకరణ సాధ్యం కాని పక్షంలో పోలింగ్ రోజు ప్రత్యామ్నాయ ఫొటో ధ్రువీకరణ పత్రాలను తీసుకొస్తే ఓటు హక్కు కల్పించాలని ఆదేశించింది. జిల్లాలో గురువారం నిర్వహించే ఎన్నికల పోలింగ్‌కు ఓటర్లు తమ హక్కు స్లిప్‌తో పాటు ప్రత్యామాన్య గుర్తింపు కార్డులను తమ వెంట తెచ్చుకోవాలని సూచిస్తున్నారు.

ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డులు ఇవే..

ఆధార్ కార్డ్, జాతీయ ఉపాధి హామీ పథకం కార్డు, బ్యాంకు (లేదా) పోస్టాఫీస్ జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్, కార్మిక శాఖచే జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, ఆర్‌జీఐచే జారీ చేసిన స్మార్ట్‌కార్డ్, భారతీయ పాస్‌పోర్ట్, ఫొటోగ్రఫీతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వం/ పీఎస్‌యూలు/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు ఉద్యోగులకు జారీ చేసిన ఫొటోతో కూడిన సర్వీస్ గుర్తింపుకార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలచే జారీ చేసిన అధికారిక గుర్తింపుకార్డులు, అంగవైకల్యం నిర్ధారించే అధికారిక గుర్తింపుకార్డులు.

రేపు ప్రత్యేక సాధారణ సెలవు

కామారెడ్డి క్రైం: శాసనసభ ఎన్నికలలో పోలింగ్ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి శుక్రవారం ప్రత్యేక సాధారణ సెలవుగా ప్రకటిస్తూ జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర పోలింగ్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

కామారెడ్డి క్రైం: ప్రతి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. ఈ విషయమై ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఓటర్ కార్డులు, స్లిప్పులు లేకపోయినా ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒక కార్డును వెంట తీసుకువెళ్లి ఓటు వేయాలని సూచించారు.

ప్రతి బస్సుకు జీపీఎస్ ఏర్పాటు



కౌంటింగ్ కేంద్రంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ పాటిల్

కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లే ప్రతి బస్సుకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. బుధవారం ఆయన జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ సిబ్బంది, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది ఎట్టి పరిస్థితులలోనూ ఉదయం 5.30 గంటలకు పోలింగ్ ఏజెంట్‌ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ విధులలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

'పది'కి పక్కా ప్రణాళిక

- ప్రత్యేక తరగతులు ప్రారంభం
- అభ్యాస దీపికల సరఫరా

నాగిరెడ్డిపేట: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా విద్యాశాఖ పక్కా ప్రణాళికను సిద్ధం చేసి పాఠశాలలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలు రూపొందించింది. పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఒక గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో సుమారు 18వేల మంది విద్యార్థులు మార్చిలో నిర్వహించే పదోతరగతి పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులతో కలిసి ప్రత్యేక ప్రణాళికలు చేపడుతున్నారు.

విద్యార్థులను బృందాలుగా విభజించి..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఒక్కో గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక తరగతుల్లో ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఒక సబ్జెక్టు చొప్పున బోధన చేస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని బృందాలుగా విభజించి చదివిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకదృష్టి సారించి ఉపాధ్యాయులు బోధన చేపడుతున్నారు. ప్రత్యేక తరగతులకు సంబంధించి రికార్డులు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో చేపట్టే ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఎంఈవోలు, నోడల్ అధికారులు, పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పర్యవేక్షణ చేపట్టి జిల్లా విద్యాశాఖ అధికారులకు నివేదిక సమర్పించనున్నారు. ప్రస్తుతం సాయంత్రం మాత్రమే కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు వచ్చే ఏడు జనవరి నుంచి ఉదయం కూడా కొనసాగించనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.



గోపాల్‌పేటలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల కోసం 'అభ్యాస దీపికలు'...

పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా 'అభ్యాస దీపికల'ను రూపొందించారు. ప్రతి విద్యార్థికి గణితం, జీవశాస్త్రం, భౌతిక-రసాయన శాస్త్రం, సాంఘికశాస్త్రానికి సంబంధించి అభ్యాస దీపికలను అందించారు. విద్యార్థులకు అభ్యాస దీపికలు చక్కగా ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



విద్యార్థుల కోసం రూపొందించిన అభ్యాస దీపికలు

ప్రతి రోజు ఒక్కో సబ్జెక్ట్..



పాఠశాలలో కొన్నిరోజులుగా పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతిరోజూ సాయంత్రం ఒక గంటపాటు ప్రత్యేక తరగతులు చేపడుతున్నాం. ప్రతి రోజూ ఒక్కో సబ్జెక్టు చొప్పున ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్నారు. జనవరి నుంచి ఉదయం, సాయంత్రం ఒక్కో గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం.

– వెంకట్రాంరెడ్డి, హెచ్‌ఎం, గోపాల్‌పేట

క్రైం కార్నర్

కామారెడ్డిలో రూ.56.84 లక్షలు స్వాధీనం

కామారెడ్డి రూరల్: కామారెడ్డిలోని జీవదాన్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఓ కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి చెందిన కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో అక్రమంగా నగదు నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి 12 గంటల వరకు ఐటీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రూ.56.84 లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్పీ సింధుశర్మ బుధవారం తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, అతని అనుచరులు కార్యాలయం ఎదురుగా నిలబడి ఉండగా వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. నోట్ల కట్టలు లభించడంతో ఐటీ అధికారి అభిషేక్ శుక్లా ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో తనిఖీలు, విచారణ చేసినట్లు వెల్లడించారు. నగదును సీజ్ చేసి గూడెం శ్రీనివాస్‌రెడ్డితోపాటు అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: మండల కేంద్రంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ బుధవారం తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం మంగళవారం సాయంత్రం 5 గంటల తరువాత ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన వారు తప్ప ఇతరులు స్థానికంగా ఉండరాదనే నిబంధన పాటించని ఐదుగురు కాంగ్రెస్ స్థానికేతరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫుట్‌వేర్ గోదాంలో చోరీ

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ రోడ్డులో ఉన్న ఓ ఫుట్‌వేర్ గోదాంలో చోరీ జరిగిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాన్సువాడకు చెందిన మహమ్మద్ ఖదీర్ కొన్ని రోజులుగా జీవదాన్ ఆసుపత్రి ప్రాంతంలో ఫుట్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. షాపు వెనుకభాగంలో గోదాం ఉంది. ఈ నెల 25న శనివారం సాయంత్రం ఎప్పటిలాగే తాళం వేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం తిరిగి వచ్చి చూసేసరికి గోదాంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దాదాపు రూ.7 లక్షలకు పైగా సరకు చోరీకి గురైనట్లు బాధితుడు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

డబ్బుల కోసం ఆందోళన

భిక్కనూరు: ఓవైపు ఎన్నికలలో గెలుపు కోసం పలువురు అభ్యర్థులు డబ్బులు పంపిణీ చేస్తుండగా.. మరో వైపు పార్టీలు పంపిన డబ్బులను స్థానిక నేతలు పంచడం లేదంటూ ప్రజలు ఆందోళనకు దిగారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని ఓ ప్రధాన పార్టీ నేత ఇంటి వద్ద భారీగా ప్రజలు చేరి, డబ్బుల కోసం ఆందోళన చేశారు. పార్టీ హైకమాండ్ నుంచి వచ్చిన డబ్బులను ఎందుకు పంచడం లేదంటూ సదరు నేతను ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి వచ్చి ప్రజలను పంపించారు.

పంపకాలు.. విన్నపాలు..

మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో రెండు ప్రధాన పార్టీలు తమ కార్యకర్తల ద్వారా పెద్ద ఎత్తున డబ్బులను పంపిణీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మరోపార్టీ కార్యకర్తలు మాత్రం దీనికి భిన్నంగా ఇంటింటికి వెళ్లి తమ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ఓటర్ల కాళ్లు మొక్కారు. పార్టీ గెలుపుకోసం కార్యకర్తలు ఇలా ప్రాధేయపడడం ఓటర్ల మనసులను కదిలించింది.

వాహనాల తనిఖీ

తాడ్వాయి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి, ఎర్రాపహాడ్, క్రిష్ణాజివాడిలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

వడగళ్ల వానతో కోళ్ల మృత్యువాత



నిజామాబాద్‌రూరల్: మండలంలోని మాధవనగర్ ప్రాంతంలో ఉన్న ఫౌల్ట్రీఫారంలో 2550 కోళ్లు మృతిచెందినట్లు ఫౌల్ట్రీఫారం యజమాని రంజిత్‌కుమార్ బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు ఫౌల్ట్రీఫారం పైకప్పు రేకులు గాలిదుమారానికి ఎగిరిపోయాయి. దీంతో అందులో ఉన్న కోళ్లు మృతిచెందినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి తనను ఆదుకోవాలని కోరారు.

మద్యం పట్టివేత

బిచ్కుంద: మండల కేంద్రంలోని ఎల్లమ్మ వైన్స్ పక్కన ఉన్న పర్మిట్ రూంలో అక్రమంగా దాచిన మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. పక్కా సమాచారం మేరకు వైన్స్ షాపులోని పర్మిట్ రూంపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. రూ.2,52,580 విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ వెంట ఎస్సై అభిషేక్, సిబ్బంది ఉన్నారు.

మోపాల్‌లో..

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లి శివారులో అక్రమంగా బైక్‌పై తరలిస్తున్న 96 క్వార్టర్ల మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ బుధవారం తెలిపారు. పట్టుకున్న మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.